క్లుప్తంగా

విద్యుత్ మోటార్లు చోరీ

శంకరపట్నం: సాగునీటి కాల్వకు బిగించిన వ్యవసాయ మోటార్‌ను చోరీ చేశారు. మండలంలోని కన్నాపూర్‌కు చెందిన రైతు నాయిని శ్రీనివాస్ గ్రామ శివారులో వ్యవసాయంసాగు చేస్తున్నాడు. సాగునీటి కాలువకు మోటార్ బిగించి వరిపొలానికి నీరు అందిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున పొలం వద్దకు వెళ్లే చూడగా మోటార్ కనిపించలేదు. మోటారు చోరీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పలపల్లి గ్రామంలో మరో విద్యుత్ మోటార్ చోరీ చేశారు. ఎల్‌ఎండీ నుంచి వచ్చే ప్రధాన కాలువకు ఇప్పలపల్లి రైతులు వ్యవసాయ మోటార్లు బిగించి పంటలకు నీరు పారిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓదెల దేవరాజ్ మోటార్‌ను దొంగిలించారు. శుక్రవారం మోటార్ కనిపించకపోవడంతో దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వినియోగించుకోవాలి

మానకొండూర్: రాజీవ్ యువ వికాసం గొప్ప పథకం అని, యువత సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ముక్కెర సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక, జూన్ 2న లబ్ధిదారులకు పత్రాల మంజూరు చేయనున్నారని తెలిపారు. పథకం ద్వారా ఐదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కేయద్దు

చొప్పదండి: ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం నొక్కేయడం తగదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే నెపంతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాని ప్రభుత్వం ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేయడం హేయమైన చర్య అని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారని, ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుబాటు తప్పదన్నారు.

కాలినడకన పోవాలి.. ఎండలో రావాలి

- ‘ఉపాధి’ కూలీల వెతలు
- పని ప్రాంతాల్లో సౌకర్యాలు కరువు
- ఎండలకు తాళలేక పోతున్న వైనం
- ఇంటి నుంచే బాటిళ్లలో తాగునీరు
- దూరభారమైన తప్పని పరిస్థితి



ఆటోల కోసం ఎదురుచూస్తున్న కూలీలు



ఎండలో పని చేస్తున్న కూలీలు

మానకొండూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వెతలు అనేకం, పని ప్రదేశంలో నీరు, మెడికల్ కిట్లు, నీడ సౌకర్యం అంతంతే. క్షేత్ర స్థాయి సిబ్బందే తాత్కాలిక వసతులు కల్పిస్తున్నారు. చాలా చోట్ల షెడ్‌నెట్లు ఏర్పాటు చేయడం లేదు. గతంలో పని ప్రదేశంలో షెడ్ నెట్లు, నీరు, మెడికల్ కిట్లు ఇతర వసతులు కల్పించారు. మార్చి మొదటి వారం నుంచే ఎండలు ముదరడంతో పనులకు వెళ్లే కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద రోడ్లు, నీటి నిల్వ గుంతల పనులు చేయిస్తున్నారు. ఇప్పుడిప్పుడే కూలీల సంఖ్య పెరుగుతోంది. పనులు గ్రామ శివారులోని గుట్టలు, ఏటిగట్టు కాలువల వద్ద జరుగుతున్నాయి. గ్రామం నుంచి సుమారు రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో పనులు జరుగుతున్నాయి. ఎండ వేడిమి నుంచి తప్పించుకోవడానికి ఉదయమే తట్ట, గడ్డపారలు, వాటర్ బాటిళ్లతో పని ప్రదేశాలకు కాలినడకన వెళ్తున్నారు. మండే ఎండలో ఇంటికి తిరిగివస్తున్నారు. పని ప్రదేశంలో నీటివసతి కల్పించడం లేదని, ప్రమాదం జరిగితే కనీసం మెడికల్ కిట్టు కూడా లేదని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఉపాధిహామీ క్షేత్ర స్థాయి సిబ్బందే అక్కడో ఇక్కడో ఉన్న పరదాలతో తాత్కాలిక నీడ సౌకర్యం కల్పిస్తున్నారు. తాగునీరు తెప్పిస్తూ కూలీల దాహార్తి తీరుస్తున్నారు. కూలీలు వెంట తెచ్చుకున్న బాటిళ్ల నీటినే పని అయిపోయేంత వరకూ గొంతు తడుపుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం పని ప్రాంతాల్లో వసతుల కల్పనపై పూర్తి స్థాయిలో దృష్టిసారించడం లేదని కూలీలు వాపోతున్నారు. మరోవైపువేసవి ఆరంభలోనే భానుడు భగభగ మండుతున్నాడు. కూలీలు ఎండ వేడికి తాళలేక పోతున్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు కానీ ఇప్పటి వరకూ అమలు కావడం లేదు.

అన్ని వసతులు కల్పిస్తాం

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో నీడ, తాగునీటి వసతితోపాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. త్వరలో కూలీలకు షెడ్ నెట్లు, ఇతర వసతులు కల్పిస్తాం.

– శ్రీధర్, డీఆర్‌డీవో

ఆటోలో పోతున్నాం



ఉదయమే పనికి వెళ్తున్నాం, మధ్యాహ్నం ఇంటికి వస్తున్నాం. అన్నారం నుంచి పని ప్రాంతానికి 4 కిలోమీటర్లు ఉండటంతో ఆటోలో పోయిరావాల్సి వస్తోంది. కూలీ తక్కువ వస్తోంది. పనికి వెళ్తే వచ్చే వేతనం కన్నా ఖర్చు ఎక్కువ అవుతోంది.నీటి నిల్వగుంత తవ్వాలంటే మట్టి తెగడం లేదు.

– తొర్రికొండ లక్ష్మి, అన్నారం

బాటిళ్లలో నీరు తీసుకెళ్తున్నాం



ఉపాధి కూలీ గిట్టుబాటుకావడం లేదు. కూలీ డబ్బులు కూడా చాలా రోజులకు ఖాతాల్లో పడుతున్నాయి. ఇంటి నుంచి చాలా దూరంలోని పనిప్రదేశానికి ఆటోలో వెళ్తున్నా రోజుకు రూ.రెండు వందల వరకే వేతనం పడుతోంది. నీటి వసతి కల్పించకపోవడంతో ఇంటి నుంచే బాటిళ్లలో నీరు తీసుకెళ్తున్నాం.

– బుర్ర శ్రీలత, అన్నారం



మానకొండూర్: మండలంలోని అన్నారం నుంచి ఈదులగట్టెపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు వెంబడి తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. ప్రమాదం బారిన పడకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సత్యనారాయణ, ఏఈ, మానకొండూర్ సబ్‌స్టేషన్, సెల్ నంబర్: 83099 21090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



చొప్పదండి: జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హోలీ.. రంగుల కేళీ

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గంగాధర మండలం బూర్గుపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. జమ్మికుంట పట్టణం, మండలంలో ఐఎంఏ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టౌన్ సీఐ రవి బందోబస్తు నిర్వహించారు. వాడవాడలా రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం రంగుల పండుగలో మునిగితేలారు.



హుజూరాబాద్: హోలీ వేడుకల్లో మాజీ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు



గంగాధర:హోలీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



జమ్మికుంటలో..



చొప్పదండిలో..



సైదాపూర్: హోలీ ఆడుతున్న చిన్నారులు



రామడుగు: వెలిచాలలో..



శంకరపట్నం: కేశవపట్నంలో..



మానకొండూర్: అన్నారంలో..



మానకొండూర్: లలితాపూర్‌లో..



మానకొండూర్‌లో ..



శంకరపట్నం: వేడుకల్లో కేశవపట్నం దేవసేన గ్రూప్ మహిళలు



చిగురుమామిడి: ఇందుర్తిలో..



శంకరపట్నం: ధర్మారంలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

వైభవంగా రథోత్సవం



రామడుగు: వెలిచాలలో రథోత్సవం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. మహాపూర్ణాహుతి, శ్రీపుష్పయాగంతో పాటు పలు పూజా కార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావుతో పాటు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పరమల్యాలలో..

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామం తుమ్మెదల గుట్టపై వెలిసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారి విగ్రహాల ఊరేగింపుతో పాటు గిరిప్రదీక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



గంగాధర: ఉప్పరమల్యాలలో గిరి ప్రదక్షిణ

శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర

చిగురుమామిడి: మండలంలోని రేకొండ ఊరగుట్టపై వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఆలయకమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కోశాధికారి అరిగెల రమేశ్, కార్యదర్శి సతీశ్, కార్యవర్గ సభ్యులు మామిడి అంజయ్య, కొండయ్య, రాజు, సంజీవ, సంపత్, సందీప్‌రెడ్డి, వేణు, అనిల్‌రెడ్డి, చాడ శ్రీధర్ రెడ్డి, శంకర్, సదానందం, రవీందర్ పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు

చొప్పదండి: పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సింహాచలం జగన్మోహన్‌స్వామి, అర్చకుడు శ్రీభాష్యం నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవ నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గాయకులు గడ్డం రమేశ్, వడ్లూరి సుధాకర్‌ల బృందం ఆలపించిన భజన పాటలు ఆకట్టుకున్నాయి.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు గోడపర్తి శ్రీనివాస్ శర్మ, ప్రేమ్ నారాయణ్ మిశ్రా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహాహారతి, తీర్థప్రసాదం వితరణ, అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిరిమల్ల జయేందర్, ఎలిమిల్ల రాజేంద్రప్రసాద్, జగదీశ్వర్, మామిడాల మనోహర్, వీర్రాజు, దోనకొండ మల్లారెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్, శ్రీధర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: హోమంలో నిర్వహిస్తున్న అర్చకులు



చిగురుమామిడి: దర్శనం కోసం భక్తుల క్యూ

మంచినీటి బావిలో పడిన కుక్క

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ గ్రామానికి మంచినీరు అందించే బావిలో శుక్రవారం ఓ కుక్క పడింది. గమనించిన స్థానికులు వెంటనే బయటకు తీశారు. ఊరంతటికి ఈ బావి నుంచే సరఫరా అవుతోంది. ఒకవేళ కుక్క చనిపోయి ఉంటే తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని స్థానికులు అన్నారు. కుక్కను బావి నుంచి బయటకు తీసిన మార్క వీరేశం గౌడ్, మార్క మల్లేశం, ములుగురి కుమారస్వామి, కవ్వంపల్లి బండి నరసయ్యకు గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు.



హుజూరాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కొనసాగుతున్న నిరసన

హుజూరాబాద్: గ్రూప్ 1,2,3 ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుంది. ఎంఎస్పీ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాట్లాడుతూ.. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతారని ప్రచారం జరుగుతుంటే బిల్లు రాక ముందే హడావుడిగా ఉద్యోగ ఫలితాలు ప్రకటించడం మూలంగా మాదిగలకు అన్యాయం జరుగుతుందని, సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు వసంత్, వాసు, శ్రీనివాస్, రాజ్‌కుమార్, భాస్కర్, మొగిలయ్య, శేఖర్, ప్రభాకర్ తదితరులున్నారు.

నల్లగొండలో శకటోత్సవం



తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శకటోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంతోపాటు వివిధ గ్రామాలు, చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో వచ్చిన భక్తులు శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువుదీరిన కొండచుట్టూ ప్రదక్షిణ చేశారు. గుట్టచుట్టూ ప్రదక్షిణ చేస్తే స్వామివారి చల్లని చూపుతో ఏడాదంతా ఎలాంటి ప్రమాదం జరగకుండా వాహనాలు తిరుగుతాయని, మంచి ఆదాయం వస్తుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన శకటోత్సవంలో భారీగా భక్తులు వాహనాలతో తరలివచ్చారు. రాత్రి పొద్దుపోయే వరకూ వాహనాలు గుట్టచుట్టూ తిరిగాయి. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఈవో అనిల్ కుమార్, ఆలయ చైర్మన్ లక్ష్మణ్ పర్యవేక్షించారు. తిమ్మాపూర్ సర్కిల్ సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్సై వివేక్ భక్తులకు అసౌకర్యం కలుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘనలు, అల్లర్లు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఎస్సై వివేక్ స్వయంగా ఆలయం ప్రాంగణంలో పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యుత్ సరఫరా బంద్

జమ్మికుంట: సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జమ్మికుంట రూరల్ ఏఈ రమేశ్ తెలిపారు. కొత్తపల్లి, తనుగుల సబ్ స్టేషన్‌ల పరిధిలో సాయంత్రం వేళ కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.